క్లుప్తంగా

నిర్భయంగా దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తఖీబాషా

కోవెలకుంట్ల: మద్యం దుకాణాలకు రాజకీయ, అధికారిక ఒత్తిళ్లకు తావు లేకుండా నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ తఖీబాష తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో 11 మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు మూడు విధానాల్లో ఈ నెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడగించిందని చెప్పారు. ఈనెల 14వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో మద్యం దుకాణాల లాటరీ ఉంటుందన్నారు. ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్‌నాయక్, సందీప్‌యాదవ్ పాల్గొన్నారు.

14 నుంచి 'పల్లె పండుగ'

కొలిమిగుండ్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి గురువారం తెలిపారు. ఆగస్టు23న జరిగిన గ్రామసభల్లో తీర్మానించిన పనులకు శంకుస్థాపనలు చేసి, పనులు పూర్తి చేసే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉపాధి హామి నిధులతో గ్రామ పంచాయితీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు జరుగుతాయన్నారు.

ఒకే యాప్‌గా మార్పు చేయాలి

బనగానపల్లె రూరల్: అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె కాలంలో ప్రభుత్వం అంగీకరించిన విధంగా అన్ని యాప్‌లను ఒకే యాప్‌గా మార్పు చేసి అంగన్‌వాడీ వర్కర్ల పై పని భారం తగ్గించాలని జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు షేబరాణి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సినియర్ అసిస్టెంట్ చంద్రమోహన్‌కు అందజేశారు. ప్రభుత్వం రికార్డులు కూడ ఇవ్వలేదని, దీంతో అంగన్‌వాడీ వర్కర్లు సొంత ఖర్చు పెట్టుకొని రాయడం వల్ల పనిభారం, ఆర్థిక భారం పెరుగుతుందని చెప్పారు. వెంటనే రికార్డులకు అందజేసి పని భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సెక్రటరీ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ గురువారం తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని సంజామలలో అంగన్‌వాడీ కార్యకర్త, కొలిమిగుండ్ల మండలం కొండమనాయినిపల్లెలో ఒకటి, సంజామలలో రెండు, కోవెలకుంట్ల మండలం భీమునిపాడులో ఒకటి, బనగానపల్లె మండ లం వెంకటాపురం, పలుకూరు గ్రామాల్లో ఒ క్కొక్కటి చొప్పున అంగన్‌వాడీ ఆయా పోస్టు ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 21వ సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల్లోపు వయస్సు క లిగి ఉండి, పదవ తరగతి ఉత్తీర్ణులై వివాహితు లై, స్థానికంగా ఉన్న మహిళలు అర్హులన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోపు బనగానపల్లె ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

పంచాయతీ వారోత్సవాలు విజయవంతం చేద్దాం

బనగానపల్లె రూరల్ : మండలంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో అధికారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బీవీ రమణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో పాటు ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున్న పాల్గొనేలా గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్‌శాఖ డీఈ నాగశ్రీనివాసులు, ఏఈ రమణ, ఏపీఓ రేష్మా, ఈసీ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ బాబు



బేతంచెర్ల: బేతంచెర్ల నూతన ఎస్ఐ రమేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో బేతంచెర్ల ఎస్ఐగా విధులు నిర్వహించిన అశోక్ సీఐగా పదన్నోతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న రమేష్ బాబు ఇక్కడికి వచ్చారు.

సాగులో సస్యరక్షణే కీలకం

- తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు


వరి పొలంలో ఎరువులు చల్లుతున్న రైతు

అవుకు: వరిసాగులో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు పాటించటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంటను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరి నాట్లు పూర్తవ్వడంతో ఇక నుంచి పంటకు తెగుళ్ల సోకే అవకాశం ఉండటంతో వ్యవసాయ శాఖ సిబ్బంది సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

4,781 హెక్టార్లలో వరిసాగు..

ఈ ఏడాది వర్షాలు కురవడంతోపాటు అవుకు జలాశయంలో నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులు వరిపంట సాగుపై అధిక దృష్టి సారించారు. అవుకు మండలంలో ఖరీఫ్‌లో వరిసాగు 4,061 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం ఉండగా 4,781 హెక్టార్లలో సాగు చేశారు.

జింక్ లోపం నివారణ..

వరినాట్లు వేసిన నెల నెలన్నరకు జింక్ లోపం కనిపిస్తుంది. ఈ లోపం ఉన్న పంటలో 3 లేదా 4 ఆకులతో ఈనె పాలిపోతుంది. నాటిన రెండు నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెలకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి ఆకు పెలుసుగా ఉంటుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్ సల్ఫేట్ ద్రావణం తగినంత మోతాదులో పిచికారీ చేయాలి.

ఆకుముడత తెగుళ్లు

గొంగలి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయటం వలన ఆకులు తెల్లబడతాయి. దీని నివారణకు 2.5 మి.లీ క్లోరిఫైరిపాస్‌ను లీటరు నీటికి కలిపి తగినంత మోతాదులో పంటకు పిచికారీ చేయాలి. ఆకుముడత తెగులు మన ఏరియాలో తక్కువగానే వస్తుంది.

సుడిదోమ

సుడిదోమ వ్యాపిస్తే వరిపొలంలో దోమ ఉధృతి వల్ల అవి ఉన్న చోట పంట ఎండిపోతుంది. దీని నివారణకు 0.6గ్రాములు ట్రైసైక్లోజోలును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే గట్లపై కలుపును ఎప్పటికప్పుడు నివారించుకోవాలి.

ఆకుఎండు తెగులు... నివారణ

బ్యాక్టీరియా వలన ఆకు ఎండు తెగులు వస్తుంది. ఈ తెగులు నివారణకు నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు వేసుకోవాలి. అలాగే తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి.

ఉల్లికోడు తెగులు

ఒకే రకమైన పంటను సాగు చేయడంతో వాటిలో పురుగును తట్టుకునే సామర్థ్యం కోల్పోవడం, వాతావరణంలో జరిగే అసాధారణ మార్పుల వలన ఉల్లికోడు తెగులు సమస్య ఎదురవుతుంది. దీని నివారణకు నారుమడి దశలోనే చర్యలు తీసుకోవాలి. లేకపోతే పంట దిగుబడి వచ్చే అవకాశం కూడా ఉండదు.

నీటి యాజమాన్యం..

పిలకలు వేసే దశలో పైరు దుబ్బు వేయటం పూర్తయ్యే వరకు పొలంలో 2 సెంటీమీటర్ల నీరు ఉండాలి. చిరు పొట్ట దశలో పూత దశలో పొలంలో 5 సెంటీమీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం..

భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి.

కాండం తొలచు పురుగు నివారణ

నారుమడి నుంచి పూత దశ వరకు వరిపంటకు కాండం తొలచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వ చనిపోవటం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడటం జరుగుతుంది. దీనివల్ల తాలుగింజలు ఏర్పడి, పంట నాణ్యత, దిగుబడి బాగా తగ్గిపోతుంది. దీని నివారణకు 2గ్రాములు కార్టప్ హైడ్రాక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పోటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరిపంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పని సరిగా చేపట్టాలి. నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్నపాటి మెలకువలు అనుసరించడం వలన పెట్టుబడులు తగ్గడంతోపాటు దిగుబడులు పెరుగుతాయి. ఆయా గ్రామాల్లోని వీఏఏల ద్వారా రైతులను చైతన్య పరుస్తున్నాం. రైతులకు అవసరమైన ఎరువులు ఆయా గ్రామాల్లోన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

– అబ్దుల్ హక్, అవుకు మండల వ్యవసాయ అధికారి

విద్యార్థులకు బహుమతులు

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారి శాలలో దసరా నవరాత్రుల సందర్భంగా విద్యార్థుల కు భగవద్గీత కంఠస్త పోటీలు నిర్వహించారు. ప్రతి భ చాటిన విద్యార్థులకు పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండా గోపాలు, కందగడ్డల జనార్ధన్, బచ్చు సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

రైతు అనుమతి లేకుండా మిరపకాయల విక్రయం


మాట్లాడుతున్న రైతు సూర్యనారాయణ రెడ్డి

సంజామల: గోదాము నిల్వ ఉంచిన మిరపకాయలను రైతు అనుమతి లేకుండా గోదాము యజమాని అక్రమంగా విక్రయించి అన్యాయం చేశాడని రైతు సూర్యనారయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం మండలకేంద్రంలో విలేకరుల ఎదుట వివరాలు వెల్లడించాడు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. 2023లో పండిన ఎండుమిర్చి 128 బస్తాలను కోవెలకుంట్ల సొదరదిన్నె గ్రామ సమీపంలో ఉన్న గోదాములో నిల్వ ఉంచాడు. దిగుబడిపై ఉయ్యాలవాడ మండలం మాయలూరు గ్రామంలో ఉన్న కరూర్ వైశ్య బ్యాంక్‌లో రూ.5.52 లక్షల రుణం తీసుకున్నాడు. రైతు తీసుకున్న రుణానికి అదే ఏడాది రూ.లక్ష తిరిగి బ్యాంక్‌కు చెల్లించాడు. కొన్ని రోజుల తరువాత బ్యాంక్ మేనేజర్, సిబ్బంది పేరుసోములకు వచ్చి క్లియరెన్స్ పేపర్ అని సంతకాలు చేయించుకున్నారు. గత నెల 23వ తేదీ మిరపకాయలను అమ్మడానికి గోదాముకు వెళ్లగా నీ మిరపకాయలు విక్రయించానని గోదాము యజమాని ఈదుల శివారెడ్డి చెప్పాడు. దాదాపు రూ.10 లక్షలు విలువగల సరుకును అమ్మి అన్యాయం చేశాడని, ఈ విషయంపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తానని రైతు తెలిపాడు.

నూతన విధానంతో వ్యాపారులకు ఎక్కువ ఆదాయం

- జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు

బనగానపల్లె రూరల్: నూతన మద్యం పాలసీ వ్యాపారులకు లాభసాటిగా ఉంటుందని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వి.రాముడు అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసి, విలేకరులతో మాట్లాడారు. మద్యం దుకాణం దక్కించుకున్నవారికి ప్రభుత్వమే 20 శాతం మార్జిన్‌మనీ ఇస్తుందన్నారు. ఏడాదికి రూ.10 కోట్ల వ్యాపారం జరిగితే రూ.2 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. మద్యం దుకాణాలకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అవకాశం కల్పించిందన్నారు. ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకైనా దరఖాస్తు చేసుకుకోవచ్చన్నారు. జిల్లాలో 105 మద్యం దుకాణాలకు గానూ 1,627 దరఖాస్తులు వచ్చాయన్నారు. రాజకీయ పార్టీల నాయకులో, ఇంకా ఎవరి ఒత్తిళ్ల వల్లో, ఇతర కారణాతోనే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని వారు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయన వెంట డీటీఎఫ్ సీఐ లక్ష్మణదాసు, ఎక్సైజ్ సీఐ వర్దనదేవి, ఎస్ఐ కమలార్ ఉన్నారు.

మద్యం దుకాణాలకు నిర్భయంగా దరఖాస్తు చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు

బేతంచెర్ల: మద్యం దుకాణాలకు ఎవ్వరైనా నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ రాముడు, సీఐ లక్ష్మణదాసు సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో వారు మాట్లాడారు. బేతంచెర్ల మండలంలో ఉన్న 7 మద్యం దుకాణాలకు తక్కువగా దరఖాస్తులు వచ్చాయన్నారు. శుక్రవారం రాత్రి 7గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. నూతన మద్యం పాలసీ ప్రకారం ఒక సంవత్సరంలో రూ. 10 కోట్ల వ్యాపారం జరిగితే రూ. 2 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. స్వేచ్ఛగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, మద్యం దుకాణం దక్కిన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని రకాలుగా రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

మద్యం దుకాణాలకు 34 దరఖాస్తులు

ప్యాపిలి: ప్యాపిలి మండలానికి కేటాయించిన మూడు మద్యం దుకాణాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు 34 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ ఎస్ఐ సోమశేఖర్ రావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మధుసూదన్‌తో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 11వ తేదీ రాత్రి 7 గంటలకు ముగుస్తుందన్నారు. 12 వ తేదీ దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. 14 వ తేదీ లక్కీడిప్ తీసి మద్యం దుకాణాలు దక్కించుకున్నవారి వివరాలు వెల్లడిస్తామన్నారు. 16 వ తేదీ నుంచి కొత్త దుకాణాలు ఏర్పాటవుతాయని ఆయన వివరించారు.

మద్యం దుకాణాలకు 110 దరఖాస్తులు

కోవెలకుంట్ల: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 110 దరఖాస్తులు అందినట్లు ఆ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని ఆయా మండలాల్లో 11 దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో కోవెలకుంట్ల మండలంలోని ఐదు షాపులకు సంబంధించి 49 దరఖాస్తులు, సంజామల మండలంలో నాలుగు షాపులకు 31, దొర్నిపాడు మండలంలో ఒక షాపుకు 15, ఉయ్యాలవాడలో ఒక షాపుకు 15 చొప్పున దరఖాస్తులు అందాయన్నారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ముస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆశాఖ సీఐ తఖీబాష, ఎస్ఐలు సందీప్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమణయ్య

సంజామల: ప్రస్తుతం సమాజంలో సెల్‌ఫోన్ వినియోగం ఎక్కుగా ఉండడం వల్ల సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వస్తే మీ వ్యక్తిగత సమచారాన్ని తెలపకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

స్ఫూర్తి సేవా సంస్థకు పురస్కారం


దసరా పురస్కారం అందుకుంటున్న మధు

డోన్ టౌన్ : సామాజిక సేవలు చేస్తున్న స్ఫూర్తి సేవా సంస్థకు అవని వారధి చారిటబుల్ ట్రస్టు దసరా పురస్కారం 2024 అవార్డు దక్కింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మధును ట్రస్ట్ సభ్యులతోపాటు ప్రముఖులు సత్కరించి పురస్కారం అందజేశారు. స్ఫూర్తి సంస్థ సేవా కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలు అందించిన వారికి ఈ సందర్భంగా మధు కృతజ్ఞతలు తెలిపారు.

13న దుర్గామాత ఉత్సవ విగ్రహాల నిమజ్జనం


సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో కొలువైన 8 దుర్గామాత ఉత్సవ విగ్రహాలకు ఈనెల13న నిమజ్జనం వేడుకలు నిర్వహిస్తున్నట్లు శ్రీదుర్గాదేవి మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు గౌరి హుసేన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాశ్ బాబు, కమిషనర్ హరి ప్రసాద్, చైర్మన్ చలం రెడ్డి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దుర్గామాత ఉత్సవ విగ్రహాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ బద్ధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలను సమిష్టిగా విజయవంతం చేయాడానికి అందరూ కృషి చేయాలన్నారు. నగర పంచాయతీ తరపున సహకారం అందిస్తామని చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నాగమోహన్, మారుతి కృష్ణ, హరి, వీరారెడ్డి, మురళీ కృష్ణ పాల్గొన్నారు.


కోవెలకుంట్లలో మహిషాసురమర్ధినిగా వాసవీమాత


దుర్గాదేవి అలంకారంలో మారెమ్మ


బనగానపల్లెలో శ్రీమహిషాసురమర్ధినిదేవి అలంకారం


బేతంచెర్ల: మద్దిలేటి స్వామి ఆలయంలో దుర్గాదేవిగా..


ప్యాపిలి: దుర్గాదేవి అలంకరణలో వాసవీమాత

మహిషాసురమర్దిని.. పాహిమాం

సాక్షినెట్‌వర్క్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఎనిమిదవరోజు గురువారం వివిధ ఆలయాల్లో కొలువైన అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించుకున్నారు.

బనగానపల్లె : నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమా మహేశ్వరమ్మలు గురువారం దర్శించుకున్నారు.ఆలయంలో శ్రీమహాగౌరి అలంకారంలోఉన్న శ్రీచౌడేశ్వరిదేవిని దర్శించుకున్నారు.


దోన్ టౌన్ : మహిషాసురమర్ధినిగా అమ్మవారు


బేతంచెర్ల: చౌడేశ్వరీ మాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు


పాత బస్టాండ్ కనకదుర్గాదేవీ



శ్రీమహాగౌరి అలంకారంలో ఉన్న చౌడేశ్వరి దేవిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

17 వాల్మీకి జయంతి


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

డోన్ టౌన్ : వాల్మీకి మహర్షి జయంతిని ఈ నెల 17వ తేదీని ఘనంగా నిర్వహించనున్నట్లు వాల్మీకి సంక్షేమ సంఘం నాయకులు భాస్కర్‌నాయుడు, పోస్టు ప్రసాద్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, బుర్రు శ్రీధర్, లాయర్ శివరామకృష్ణ, పూల శ్రీను, మేకల రాజు తెలిపారు. వాల్మీకి జయంతి నిర్వహణపై గురువారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని శ్రీముక్తేశ్వర ఆలయంలో నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా జయంతి కమిటీని ఏర్పాటు చేసి కార్యక్రమాల నిర్వాహణ బాధ్యతలపై సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జయంతి రోజు పాతపేట రాముల దేవాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా వాల్మీకి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెక్క భజనలు, కోలాటంలు, డప్పు వాయిద్యాలు మధ్య ర్యాలీ ఉంటుందని, వాల్మీకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, ప్రహ్లాద, మధు, ఉడుముల పాడు నాగేంద్ర, రంగస్వామి, రాంపల్లె శ్రీను, నాయుడు, రవికిషోర్, లాల్‌మాన్‌పల్లె గోవిందు, డీలర్ కృష్ణ, మహేంద్ర, రమేష్, తిరుపాల్, తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి దేశానికి లోటు


ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి దేశానికే లోటని అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడూ పేదల అభ్యున్నతికి పాటుపడే వ్యక్తి, తాను సంపాదించన సంపాదనలో 65 శాతం దాతృత్వానికే ఖర్చు పెట్టే గొప్ప వ్యక్తి అని అన్నారు. కరోనా సమయంలో ప్రజల యోగక్షేమాలకు రూ.1500 కోట్లను కేంద్ర ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండే మనిషి మృతి చెందడం బాధాకరమన్నారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


వాహన తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ నాగార్జున

ప్యాపిలి: వాహన చోదకులు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జలదుర్గం ఎస్ఐ నాగార్జున హెచ్చరించారు. బావిపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలతో పాటు, హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారికి రూ. 3,000 జరిమానా విధించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

నీటి కుంటల్లో గంబుషియా చేప పిల్లల విడుదల


చెరువులో చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం, మర్రికుంట గ్రామాల్లోని ఎర్ర నీటి కుంటలు, చెరువుల్లో గురువారం బేతంచెర్ల మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది గంబుషియా చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ చేప పిల్లలు దోమ లార్వాలను తింటాయన్నారు. దీంతో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపులాంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చని వివరించారు.

యువత దురలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లె: యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు సూచించారు.పీహెచ్‌సీ పరిధిలోని బనగానపల్లె సచివాలయం -5 సమీపంలో రాములగుడి వద్ద గురువారం మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పొగతాగడం, మద్యపానాకి దూరంగా ఉండాలన్నారు. ఎంపీహెచ్ఓ వెంకటేశ్వర్లు ఆరోగ్య సిబ్బంది సరస్వతి, రమేష్, గ్రేసమ్మ పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ విధానాలు పాటించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

డోన్ రూరల్ : నూతన వ్యవసాయ విధానాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని కేవీకే సైంటిస్ట్ అండ్ హెడ్ ధనలక్ష్మి రైతులకు సూచించారు. మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో గురువారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేరుశన నూతన రకమైన విశిష్ట దిగుబడులపై క్షేత్రదినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతుల ద్వారా సాగుతో అధిక దిగుబడులు సాధించొచ్చని చెప్పారు. అలాగే నూనెగింజల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్ర వేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, రవిగౌడ్, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ, పీఏఏ దస్తగిరమ్మ, రైతులు పాల్గొన్నారు.